

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

8

**సినిమాకని** బయలుదేరిన సాంబశివరావు దగ్గరే వున్న స్నేహితుడు, కొలీగ్ పంచాక్షరరావు ఇంటికి వెళ్ళాడు. అతని భార్య తలుపు తీసింది.

"రావు వున్నాడా?" అడిగాడు.

"రండి, భోజనం చేస్తున్నారు కూర్చోండి."

సాంబశివరావు ముందు గదిలో కుర్చీలో కూర్చుని, ఎదురుగా టీపాయ్ మీద వున్న ఓ సినిమా వారపత్రిక అందుకున్నాడు. ఆవిడ సీలింగ్ ఫేన్ స్విచ్ నొక్కి వంటగదిలోకి వెళ్ళింది.

"సాంబశివరావు వచ్చాడండి" చెప్పింది.

పంచాక్షరరావు తల వూపాడు.

"చూస్తూంటే ఆత్మహత్య చేసుకోబోతూ, అందుకు మీ సలహా కోసం వచ్చినట్లుగా వుంది అతని మొహం."

"అరె ఏమైందిట?" అని పంచాక్షరరావు గబగబా తింటూ అడిగాడు.

"ఏమో? ఇంట్లో ఏం గొడవలున్నాయో" మూతి మూడు వంకర్లు తిప్పింది.

కాసేపాగి మళ్ళీ చెప్పింది "కొడుకొచ్చాడుగా. ఇంక హత్యో, ఆత్మహత్యో అనే స్థితికి వచ్చి వుంటాడు."

"ష్! ఏమిటా మాటలు వాడికి కొడుకేమిటి?" కసురుకున్నాడు పంచాక్షరరావు.

"లోకంలో అంతా మీలా మంచివారే వుంటారా ఏమిటి?"

"అనవసరంగా నోరు పారేసుకోకు."

"మీరు మరీ మంచివాళ్ళు కాబట్టి ఎదుటివాళ్ళంతా మంచివాళ్ళుగానే కనబడతారు మీ కంటికి."

పంచాక్షరరావుకి తన భార్య సంగతి తెలుసు కాబట్టి ఇంక ఆవిడతో వాదన పెంచుకోలేదు. అతని భార్య చాలా వింతమనిషి. లోకంలో తను, తన భర్త తప్ప మిగతా అంతా చెడ్డవాళ్ళని గాఢంగా నమ్మే మనస్థత్వం.

తన నమ్మకంలో నూటికి నూరుపాళ్ళు నిజం వుందని నమ్మే వ్యక్తి. తను అందరికన్నా గొప్పదాన్ని అనే సుపీరియారిటీ కాంప్లెక్స్ కూడా ఆమెలో వుంది. అందుకే పక్కవాళ్ళు పేరంటానికి, పెళ్ళిళ్ళకి, విందులకి పిలిచినా వెళ్ళదు. తన ఇంటికి ఎవరినీ పిలవదు. కానీ చుట్టుపక్కల వాళ్ళందరి విషయాలు ఆమెకే కావాలి. ఎవరింట్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడం ఆమె ముఖ్యమైన హాబీ.

"ఏమిటిలా వచ్చావు?" అడిగాడు ముందు గదిలోకి వచ్చిన పంచాక్షరరావు. సాంబశివరావు ఆ సమయంలో ఎప్పుడో కానీ రాడు.

"ఊరికినే."

సాంబశివరావు మాటలు, మొహంలోని భావాలు గ్రహించిన పంచాక్షరరావు అడిగాడు.

"భోజనం అయిందా?"

"ఇప్పుడే అయింది."

"పైకెళ్దాం. అక్కడ కాసేపు కూర్చోవచ్చు."

పంచాక్షరరావు ఇంటికి పైకి వెళ్ళేందుకు మెట్లు కట్టలేదు యింకా వేసవికాలంలో పైన పడుకోవడానికి అనువుగా వుండేందుకు నిచ్చెన కొన్నాడు. దాన్ని బయటికి తీసి గోడకి ఆనించాడు. సాంబశివరావు పైకి ఎక్కేదాకా నిచ్చెన పట్టుకున్నాడు. చంకలో చాపచుట్ట, రెండు దిళ్ళతో తనూ పైకెక్కాడు.

చాపని టెర్రస్ మధ్య పరిచాడు. తన భార్య సంగతి తెలుసు కాబట్టి నిచ్చెనని అలా వుంచకుండా పైకి లాగేశాడు. లేకపోతే సగం నిచ్చెన ఎక్కి దొంగచాటుగా వింటుంది.

"ఏమైంది?" అడిగాడు సిగరెట్ వెలిగించి.

"సెకెండ్ షోకి వెళదామని బయలుదేరాను."

"నేనడిగింది ఇంట్లో ఏమైంది అని?"

"అలా ఎందుకనుకుంటున్నావు?"

"రెండు ఊహలవల్ల. ఒకటి నీ వాలకం, రెండు ఇవాళ ఉదయం హనీమూన్ నించి వచ్చిన వాడివి రాత్రి వంటరిగా సెకండ్ షోకి వెళ్ళాలనుకుంటున్నందుకు."

"పెద్ద చిక్కుల్లో పడ్డాన్లే."

పంచాక్షరరావు మౌనంగా ఆలోచించసాగాడు. తన భార్య చెప్పింది నిజమైందా?

"చాలా వింత సమస్య నాది."

"ఇవాళ ఉదయం ఓ ఏడేళ్ళ కుర్రవాడు మా ఇంటికి వచ్చాడు. వాడు నా కొడుకట. నేను వాడి తండ్రినట."

"కాదా?"

"చస్తేకాదు."

"కానప్పుడు చిక్కేముంది?"

"నా భార్య ఆ కుర్రాడి మాటలే నమ్ముతోంది."

"ఆ కుర్రాడి పేరేమిటి?"

సాంబశివరావు జరిగింది పూర్తిగా చెప్పాడు.

మరో సిగరెట్ అంటించి పంచాక్షరరావు మౌనంగా ఆలోచించసాగాడు.

"నేను ప్రేమించిన అమ్మాయికే వాడు నావల్ల పుట్టాడని నా భార్య నమ్మకం."

"ఇటీజ్ సో సింపుల్. ఆ అమ్మాయిని పిలిపించి కాదని చెప్పించవచ్చు."

"కుదరదు."

పంచాక్షరావు సాంబశివరావుని పరీక్షగా చూసి అడిగాడు.

"ఏం?"

"దానివల్ల ఇంకో చిక్కు వస్తుంది."

"ఏమిటిది?"

సాంబశివరావు కొద్దిసేపు సందేహించాడు. తర్వాత చెప్పసాగడు.

"ఆ అమ్మాయి రాజేష్ తన కొడుకు కాదని చెప్తుంది. కాని అంతటితో ఊరుకోదు."

"మా ఇద్దరి మధ్యా వున్న ఓ రహస్యం చెప్తుంది."

"రహస్యమా?"

"నా వల్ల ఆ అమ్మాయికి ఓసారి నెల తప్పింది. పెళ్ళిచేసుకుంటానని నేను మాట ఇచ్చాక అబార్షన్ చేయించుకుంది. ఆ సంగతి కూడా చెపుతుంది"

"ఎందుకు చేసుకోలేదు ఆ అమ్మాయిని?"

"ఆ అమ్మాయి అర్థమయ్యేకొద్దీ నా భార్యగా అంగీకరించలేననిపించి. నాకు నచ్చని అనేక చెడ్డ గుణాలున్నాయి. పెళ్ళయితే మేమిద్దరమే కలిసి వుండాలట. మా నాన్నగారు మాతో వుండకూడదట. ఆయనకి నెలకి నూట ఏభైకి మించి యివ్వకూడదట. చుట్టాలింట్లోనో లేదా హోమ్ ఫర్ ది ఏజ్డ్‌లోనో వుంచాలిట."

"అదన్యాయం"

"నేను విజయవాడకి బదిలీ చేయించుకోవాలి. ఇక్కడికి రాదట. ఆమె విధవ తల్లి మాతోనే వుండాలి. ఆమె ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళ బాధ్యత నేనే తీసుకోవాలి."

"ఓ..."

కాసేపు మౌనంగా వుండిపోయారిద్దరూ.

"ఈ రాస్కెల్ నిజంగా నీ కొడుకు కాదా?" అడిగాడు పంచాక్షర రావు.

"ఓ ఫేమిలీ స్త్రీని నేను మొదటిసారి ముట్టుకుంది నాలుగేళ్ళ క్రితమే."

"అయితే వాడి తల్లిని రప్పించి నిలదీసి అడుగు."

"అదే ఆలోచిస్తున్నాను."

"అంత ధైర్యంగా ఎవరూ పంపరు. ఆవిడకి ఏదో ఆధారం వుండి వుంటుంది. ఎనిమిదేళ్ళ క్రితం నీకు ఎవరితోనూ ఎఫైర్ లేదా?"

"నాలుగైదుసార్లు ఫ్రెండ్స్ బలవంతం మీద డబ్బిచ్చి సుఖం కొనుక్కున్నాను. ఆ వయసులో ఇది చాలామందికి సహజం. అంతమాత్రం చేత.."

మరికాసేపు మౌనంగా వుండిపోయారిద్దరూ.

"అప్పట్లో ఒకరి దగ్గరకే తరచూ వెళ్ళేవాడివా?" అడిగాడు పంచాక్షరరావు.

"నాలుగైదుసార్లు కాలేజీ స్టూడెంట్‌నని చెప్పుకునే ఓ అమ్మాయి ఇంటికి వెళ్ళాను. అఫ్‌కోర్స్. షి వజ్ ప్రొఫెషనల్. నేనెవరో, నాపేరేమిటో ఆ అమ్మాయికి తెలిసే అవకాశంలేదు. బిసైడ్స్. ఐ యూజ్డ్ కండోమ్"

"మీ నాన్నగారేమంటారు?"

"ఆయన కూడా ఇంకా ఈ సర్‌ప్రైజ్ నుంచి సరిగ్గా తేరుకోలేదు."

మిత్రులిద్దరూ మరో అరగంటదాకా ఆ విషయం గురించి చర్చిస్తూండిపోయారు. ఇంక మాట్లాడేదేం లేదనిపించాక నిచ్చెనమీంచి కిందికి దిగారు. 'గుడ్‌నైట్' చెప్పి వెళ్ళిపోయాడు సాంబశివరావు.

అప్పటిదాకా సస్పెన్స్‌తో చచ్చిపోతున్న పంచాక్షరరావు భార్య సాహితి అడిగింది.

"ఏం జరిగిందట?"

"చాలా ఘోరమే జరిగింది" చిన్నగా నిట్టూర్చాడు.

"బాగా బాధపడుతున్నట్లున్నాడు?"

"విపరీతంగా."

"ఏమైందండీ?"

"సాయంత్రం గండుచీమ కుట్టిందట."

"గండుచీమా?" తెల్లబోతూ అడిగింది సాహితి.

"అవును. నల్లటి గండుచీమ" చెప్పాడు పంచాక్షరరావు.

ఆ రాత్రి రాజేష్ అడిగాడు.

"తాతయ్యా! నువ్వెక్కడ పడుకుంటావు?"

హాల్లో మంచమ్మీద."

"నేను నీ పక్కన వేసుకోనా నా పక్క?"

"అలాగే."

నీరజ తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది. రాజేష్ గదిలో వెలిగే బెడ్‌ల్యాంప్ వంక చూస్తూ పడుకున్నాడు కాస్సేపు. తర్వాత మెల్లిగా పిలిచాడు.

"తాతయ్యా"

"ఏమిటి?"

"నీకు కథలొచ్చా తాతయ్యా?"

"వచ్చు."

"ఏదైనా కథ చెప్పు తాతయ్యా! ప్రతీరాత్రి అమ్మ నాకో కథ చెప్తుంది.

దశరథరామయ్య పొగాకు పాయలుండే చిన్న తాటాకు బుట్టనందుకుని ఓ పాయ తీసి చుట్ట చుట్టుకుంటూ అడిగాడు.

"ఏం కథ?"

"ఏదైనా కథ."

"అనగనగా ఓ ఊళ్ళో ఓ రాజున్నాడు. ఆ రాజుకి ఏడుగురు రాజకుమారులు వాళ్ళు..."

"ఓస్ యిదా? వేటకెళ్ళి ఏడు చేపలని తెచ్చారు. ఆ కథేనా?"

"అవును."

"ఇది నాకొచ్చు. పులి, సింహం కథలేమైనా చెప్పు తాతయ్యా?"

"రేపు చెప్తాను. ఈ పూటకి పడుకో."

"తాతయ్యా!"

"మళ్ళీ ఏమిటి?"

"చుట్టలెందుకు తాగుతావు తాతయ్యా?"

"ఊరికినే."

"ఊరికినే అయితే మానేయవచ్చుగా?"

"మానేద్దాం."

"ఆర్పేయ్ తాతయ్యా - పారెయ్"

"ఇదొక్కటేగా?"

"చుట్ట తాగితే త్రోట్ కేన్సర్ వస్తుందని నీకు తెలీదా తాతయ్యా?"

"తెలుసు."

"తెలుసా? మరయితే ఎందుకు తాగుతున్నావ్?"

"ఊరికినే."

"ఊరికినే త్రోట్ కేన్సర్ రావాలనా?"

"నన్ను విసిగించక."

రాజేష్ నాలుగైదు నిమిషాల తర్వాత లేచి మంచం మీద ఓ ప్రక్కగా కూర్చున్నాడు.

"తాతయ్యా! నీకు బోలెడు కథలొచ్చని అమ్మ చెప్పింది. అమ్మ ఎందుకు అబద్ధం చెప్పింది?"

"రేపు చెప్తానన్నానుగా."

"తాతయ్యా! నీకు చీమంటే భయమా?"

"లేదు."

"చీమ వస్తే భయపడి పారిపోవుగా?"

"పోను."

"చీమ వస్తోంది. భయంలేదుగా?"

"లేదన్నానా?"

రాజేష్ దశరథరామయ్య మొహం మీదికి వంగి గట్టిగా గాలిని ఆయన కళ్ళమీదకి ఊదాడు. కళ్ళు మూసుకున్నాడు వులికిపాటుతో.

సన్నగా నవ్వి చెప్పాడు రాజేష్.

"చీమంటేనే భయంలేదన్నవాడివి 'ఉఫ్' అంటే భయపడి కళ్ళు మూసుకున్నావేం?"

దశరథరామయ్యకి చాలా చాలా ఏళ్ళ క్రితం తన కొడుకు చేసిన సరిగ్గా అలాంటి పని గుర్తుకొచ్చింది. తన చిన్నతనంలో చాలా చేసేవాడు. ఓ జనరేషన్ నించి మరో జనరేషన్‌కి ఇలాంటివి ప్రయాణం చేస్తుంటాయి. దశరథరామయ్యకి చిన్నతనం గుర్తొచ్చింది.

"ఇంక చుట్టపారెయ్ తాతయ్యా! చివరికొచ్చేసిందిగా."

దశరథరామయ్య రెండుసార్లు గుప్పుగుప్పున పీల్చి చుట్టపారేశాడు.

కాలింగ్‌బెల్ మోగింది. రాజేష్ మంచం దిగి వెళ్ళి తలుపు తెరిచాడు. సాంబశివరావు లోపలికి వచ్చాడు. ఓసారి గుడ్లురిమి చూసాడు రాజేష్‌ని. తన గదిలోకి వెళ్ళిపోయాడు విసురుగా.

రాజేష్ పిల్లిలా తన పక్కమీదికి చేరుకున్నాడు.

లోపలికి వచ్చిన సాంబశివరావుని యథాలాపంగా చూసి నీరజ మళ్ళీ తను చదువుతున్న పుస్తకంలోకి దృష్టి మళ్ళించింది. ఎదురుగ టేబుల్ మీద మంచినీళ్ళ జగ్ వంక చూసాడు.

బట్టలు మార్చుకుని నీరజ ప్రక్కన డబుల్ కాట్ మీద పడుకున్నాడు. నీరజ సాంబశివరావుని గమనించనట్లే సీరియస్‌గా పుస్తకం చదువుకుంటూంది.

"హలో" పలకరించాడు.

"హలో" నీరజ పుస్తకంలోంచి తల తిప్పకుండానే బదులు చెప్పింది.

"అంత ఇంట్రెస్టింగ్‌గా వుంద అది?" అడిగాడు.

"అవును. గుడ్‌నైట్" అటువైపు తిరిగి పడుకుంది.

"లేడీస్ ఇన్ స్లేక్స్ షుడ్ నాట్ టర్న్ దెయిర్ బేక్స్" చెప్పాడు.

కాస్సేపాగి నీరజ భుజం మీద చేయివేశాడు.

"చూస్తున్నారుగా? నేను బిజీగా వున్నాను" చెప్పింది నీరజ విసుగ్గా అతని చేతిని తోసేసి.

"వద్దు. మనం బిజీగా వుందాం."

నీరజ సాంబశివరావువైపు తిరిగి అతని జుట్టుని సవరిస్తూ మృదువుగా అడిగింది.

"ఒకటి చెప్పనా?"

"చెప్పు"

"ప్రేమ అనేది వయసు చేసే కెమిస్ట్రీ. వయసులో వున్న వారిలోని రసాయనిక మార్పులవల్ల ప్రేమ పుడుతుంది. అది మనసులోంచి పుట్టేదికాదు. చెప్పండి. మీ విషయంలో అలాగే జరిగిందా?"

"అవును. అది మనసులోంచి రాలేదు."

"అంటే మీరు మనస్ఫూర్తిగా కోరుకోలేదా రాజేష్ ఆగమనం?"

"నీరజా! వాడు నా కొడుకు కాడు."

"నా గురించి కాదు, వాడి గురించి వప్పుకోండి. బాల్యం చాలా సున్నితమైంది. ఒకసారి గాయపడితే దాని ఫలితం జీవితాంతం వుంటుంది. వాడ్ని నేను మన ఇంట్లో అంగీకరిస్తానా అన్నది వేరే విషయం."

"ఐ ప్రామిస్! వాడు నా కొడుకు కాడు."

నీరజ వెంటనే పుస్తకం అందుకుని అటువైపు తిరిగింది.

"లైటుంటే నాకు నిద్రపట్టదు" చెప్పాడు సాంబశివరావు.

"పక్కన నాకు పులివున్నా నిద్రపట్టదు. అయినా నే పడుకోవటంలా?" నీరజ కంఠం చాలా తీవ్రంగా వినిపించింది.

"పులెక్కడిది?" అడిగాడు.

"పులి తన చారలని దాచుకోలేదు."

"నీ వుద్దేశ్యం?"

"ఇప్పుడు మీకున్న కామమే ఓ రోజు రాజేష్‌కి అంకురార్పణ చేసింది."

"కామం? భార్యతో సరదాగా వుండటం కామమా?"

"పులి తన చారలని దాచుకోలేకపోవటమేకాదు, మార్చుకోలేదు కూడా."

''గుడ్ నైట్'' చెప్పాడు సాంబశివరావు వెంటనే.

మంచం మీంచి కిందపడటంతో అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది సాంబశివరావుకి. అతని ముఖం నిండా చెమటలు పట్టింది. భయంకరమైన కలవచ్చి మెలుకువ వచ్చింది అతనికి. అప్పుడే నిజంగా జరిగినట్లుగా ఆ కల ఇంకా గుర్తుంది.

సాంబశివరావు, పంచాక్షరరావు మేడమీద వంటిరిగా వుంటే రాజేష్ నిచ్చెన వేసుకుని పైకి ఎక్కి వచ్చాడు. నిచ్చెనని కిందకి తోసేశాడు. క్షణాల్లో రాజేష్ పులిగా మారాడు. విచిత్రం. ఆ పులిమీద చారలు లేవు. ఆ పులి సాంబశివరావు వైపు దూకింది. సాంబశివరావు ఆ మేడమీదే దాని బారినుంచి తప్పించుకోడానికి పరిగెత్తసాగాడు. అది వెంట పడుతోంది. దిగుదామంటే నిచ్చెనేలేదు. ఆ పులి ఓ అడుగుదూరం దగ్గరకి వచ్చింది. మొహంలో మొహం పెట్టి చూసింది. పంజా విప్పింది. పంజా విప్పుతుండగా మేడమీదనుంచి కిందకి దూకాడు సాంబశివరావు. దబుక్కున మంచమీదనించి పడ్డాడు.

గాలిలో వుండగా మెలుకువ వచ్చేసింది సాంబశివరావుకి. తలతిప్పి చూశాడు. నీరజ నిద్రపోతోంది. లేచి మళ్ళీ మంచం మీద పడుకున్నాడు.

మరో పదినిమిషాలు ప్రయత్నించాడు. కానీ నిద్రపట్టలేదు. లేచి గ్లాసుతో మంచినీళ్ళు ముంచుకుని తాగాడు. తలుపు తెరుచుకుని హాల్లోకి వచ్చాడు.

మంచం మీద దశరథరామయ్య, కింద పక్కమీద రాజేష్ పడుకుని నిద్రపోతున్నారు.

రాజేష్ మొహాన్ని కాసేపు చూస్తుండిపోయాడు సాంబశివరావు. ఇందాక తన కలలో కనిపించినట్లుగా భయంకరంగాలేదు. ఎంతో ప్రశాంతంగా, అమాయకంగా వుంది. రాజేష్ లాగు, పక్క తడిసి వుండటం గమనించి ముఖం చిట్లించాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ హాల్లో ఓ మూల అలమారలో వుంచిన రాజేష్ సామానువైపు నడిచాడు.

చేతి సంచిని తీసి చూశాడు. లోపల సీసా, చిన్న నేప్కిన్, గోళీలు తప్ప మరేమీ లేవు. తరువాత పెట్టె తెరిచాడు. లోపల ఓ వైపు రాజేష్ బట్టలు నీట్‌గా సర్ది వున్నాయి. మరోవైపు ఓ లావుపాటి బైండ్ పుస్తకం వుంది. దాన్ని అందుకుని తిరగేశాడు. అది డ్రాయింగ్ పుస్తకం చిన్న ప్లాస్టిక్ సంచిలో రంగు రంగుల క్రేయాన్స్, కుంచెలు, బ్రష్‌లు, పెన్సిలు రబ్బర్ మొదలైన వస్తువులున్నాయి.

చార్మినార్, బర్కిలీ, గోల్డ్‌ఫ్లేక్, ఫోర్స్కేర్‌లాంటి సిగరెట్ పెట్టెలనించి చింపిన ముక్కలు రబ్బర్ బేండ్‌తో కట్టివున్నాయి. తన చిన్నతనంలో అలాంటి వాటిని ఉపయోగించి పేకాడుకోవడం గుర్తొచ్చింది సాంబశివరావుకి.

చిన్నపిల్లలకి ఎంతో అమూల్యమైన అనేక వస్తువులు, రంగు రంగుల రాళ్ళు, పాత ప్లాస్టిక్ వస్తువులు, సీసా మూతలు, సినిమా పాంప్లెట్స్ లాంటివి పెట్టెనిండా వున్నాయి. దాన్ని పూర్తిగా శోధించాక కూడా సాంబశివరావుకి రాజేష్ గురించిన వివరాలు ఏం తెలియలేదు. వాడి తల్లిదండ్రులెవరో తెలుసుకునే విశేషాలేం కనపడలేదు.

చివరకు అతని దృష్టి అట్టపెట్టె మీద పడింది. ఎవరెడీ బేటరీస్ వుంచే కార్టన్ అది. నెమ్మదిగా మూత తెరిచి, చేతిని పోనిస్తూ లోపలికి చూశాడు.

వెంటనే ఓ అడుగు వెనక్కి వేశాడు.

ఆ అట్టపెట్టెలోంచి రాజేష్ పెంపుడు ఉడుత పిల్ల టింకూ తొంగి తొంగి చూస్తోంది. సాంబశివరావ్ వంక. అది దాని ఇల్లు అనుకున్నాడు అతను.

బాత్ రూంకి వెళ్ళి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయాడు. సాంబశివరావుకి తెలియదు అంతకు అరగంట క్రితమే తను దొంగతనంగా రాజేష్ సామాను వెదికినట్లుగా, నీరజ కూడా తను నిద్రలో వుండగా అదేపని చేసిందని.

ఆ ఇద్దరి సంగతి ఒక్క దశరథరామయ్యకే తెలుసు. ఆయనకి భార్యాభర్తలొచ్చిన రెండుసార్లూ మెలుకువ వచ్చింది. వాళ్ళు చేసే పనిని నిశ్శబ్దంగా గమనించాడు.

నిజానికి వాళ్ళిద్దరికన్నా ముందు ఆయనే రాజేష్ సామాను వెదికాడు. రాజేష్ తలిదండ్రుల వివరాలు తెలియజేసే వస్తువుల కోసం. ఇవేం తెలియని రాజేష్ మాత్రం నిశ్చింతగా పడుకుని నిద్రపోతున్నాడు.

9

మర్నాడు ఉదయం అయిదున్నరకు లేచింది నీరజ. హాల్లోకి వచ్చిన నీరజ్‌ని విష్ చేశాడు రాజేష్.

"గుడ్ మార్నింగ్ పిన్నీ"

అప్పటికే అతను నిద్రలేచి స్నానం చేశాడు. డ్రాయింగ్ బుక్‌లో బొమ్మలు గీసుకుంటున్నాడు.

"రోజూ నువ్వు ఉదయం నిద్రలేచేది ఎప్పుడు?" అడిగింది నీరజ.

"అయిదులోపే మెలుకువ వచ్చేస్తుంది. వెంటనే లేస్తా" చెప్పాడు.

అరగంటలో తయారైంది నీరజ. చిన్న ఎయిర్‌బేగ్‌లో రెండు రోజులకు సరిపడే బట్టలు, ఇతర వస్తువులు సర్దుకుంది. దశరథరామయ్యని నిద్రలేపి చెప్పింది.

"నేనూ, రాజేష్ విజయవాడ వెళ్ళొస్తాం మామగారూ."

"విజయవాడా?" ఆశ్చర్యపోయాడాయన.

"అవును. రాజేష్‌ని అతని తల్లి దగ్గర వదిలి వస్తాను."

"మీ ఆయన సరేనన్నాడా?"

"వాడి చెవిన కూడా ఓ మాట వేసిపోతే మంచిదేమో?"

"వారు కాదనేపని కాదుగా యిది. మళ్ళీ రాత్రి బయలుదేరి రేపు ఉదయానికల్లా వచ్చేస్తాను."

"వాడూ నీతో వస్తానంటాడేమో?"

"అది నాకిష్టం లేదండి."

ఆయనకి నీరజ చేసేపని ఎంతమాత్రం యిష్టంలేదు. కానీ వద్దని శాసించలేకపోయాడు. సాంబశివరావు లేవకుండానే భుజాన ఎయిర్ బేగ్‌తో, రాజేష్‌తో బయలుదేరింది. భుజాన తన సంచితో, చేతిలో పెట్టెతో అతను ఆమెని మౌనంగా అనుసరించాడు.

"ఎక్కడికి వెళుతున్నామండి?" అడిగాడు గుమ్మం దాటిన రాజేష్ బిక్కుబిక్కుమంటూ.

"అమ్మ దగ్గరకి."

వెంటనే అతని మొహం విప్పారింది.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in